సీతాకోక చిలుకలు పూసిన చెట్లు







గ్లాసీ టైగర్



బ్లూ టైగర్







కామన్ ఎమిగ్రాంట్





కామన్ గ్రాస్



యూప్లో మల్సీబర్



స్పాటెడ్ రస్టిక్



హైపోలిమ్నస్



చినుకు రాలి నేల చల్లబడగానే కొండాకోనా పచ్చదనం పురివిప్పుకుంది. మబ్బుల చాటు నుంచి కిరణాలు తాకిన చెట్టూపుట్టా పువ్వూమొగ్గా పులకించిపోతోంది. పూప్పాల్లో దాగిన సీతాకోకమ్మలు రెక్కలు విప్పుకుని విహారానికి బయలుదేరుతున్నాయి. తిరుమల కొండకు వచ్చే భక్తులకు కొత్త అందాలు కనువిందు చేస్తున్నాయి. నేల పిగిలినట్లు.. కొమ్మకొమ్మా సీతాకోక చిలుకలను పూసినట్లు గుత్తులు గుత్తులుగా కనిపిస్తున్నాయి. ఎన్ని రకాలో.. ఎన్ని వర్ణాలో... నెలరోజుల ఆయుష్షే అయినా ఆనందంగా పువ్వు పువ్వుమీదా వాలుతూ ఎగురుతూ మధువు గ్రోలుతూ.. ఈ దృశ్యాలు చూసి మనసు రెక్కలు తొడుక్కుంటోంది. ఫలదీకరణలో కీలక పాత్ర పోషిస్తూ వన విస్తరణకు దోహదపడేలా ప్రకృతి సృష్టించిన ఈ సౌందర్యజీవుల అందాలను తిరుమల ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కెమెరాలో బంధించి అందిస్తున్నారు...

తిరుమలలో 105 రకాల సీతాకోక చిలుకలు

శేషాచలంలో 105 రకాల సీతాకోక చిలుకలున్నట్టు అంచనా.వీటిల్లో దాదాపు సగం జనసంచారం ఉన్న చోట్ల కనిపిస్తాయి. మిగిలినవి అడవుల్లో నీటి చెలమలున్న తావుల్లోనే ఉంటాయి. సీతాకోక చిలుకల్లో అరుదైనదిగా చెప్పుకునే కామన్ బ్యాండెడ్ పికాక్ తిరుమలలో అక్కడక్కడ కనిపిస్తోంది. అతిపెద్ద సీతాకోక చిలుకగా చెప్పుకునే బ్లూ మర్మోన్ కూడా తరచూ దర్శనమిస్తోంది. వీటితో పాటు ప్రస్తుతం ఈ సీజన్‌లో బ్లూ టైగర్, గ్లాసీ టైగర్, యూప్లో మల్సీబర్, కామన్ ఎమిగ్రాంట్, స్పాటెడ్ రస్టిక్, హైపోలిమ్నస్, మిసిప్పస్ జాతి సీతాకోక చిలుకలు భక్తుల మధ్య తిరుగుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక క్రిమిసన్ రోస్, లైమ్ బటర్‌ఫ్లై, స్పాట్ స్వార్డ్‌టైల్, మాట్లెండ్ ఎమిగ్రాంట్, కామన్ గ్రాస్ ఎల్లో, కామన్ జెజ్‌బెల్, స్టాటిట్ రస్టిక్, క్రిమ్‌సన్ టిప్, యూప్లో మల్సీబర్, హైపోలిమ్నస్, ట్యాని కోస్టర్, కామన్ సెలర్, లెమన్ ఫాన్సీ, పికాక్ ఫాన్సీ, బ్లూ పాన్సీ, చాకోలెట్ ఫాన్సీ, డైనెడ్ ఎగ్‌ఫ్లై, ఫ్లైన్ టైగర్, కామన్ ఇండియన్ క్రో వంటి రకాలు కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటాయి.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

నామినేటెడ్ పదవుల కోసం

పోటాపోటీ



కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. మంత్రి వర్గం ముచ్చటా ముగిసింది. నామినేటెడ్ పదవులు ఆలస్యంచేయకుండా వెంటనే భర్తీ చేస్తామని సాక్షాత్తూ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రకటించారు. దీంతో జిల్లావ్యాప్తంగా కూటమి పార్టీల నేతల్లో జోష్ నెలకొంది. ఇక నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకుల ప్రయత్నాలైతే జోరందుకున్నాయి. ఎన్డీఏ కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీ వుండడంతో ఆ మేరకు పదవుల కోసం పోటీ తీవ్రంగా పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వున్నవే తుడా, టీటీడీ బోర్డు కావడంతో ఆశావహులందరి దృష్టీ ఆ రెండింటిపైనే వుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- తుడా, టీటీడీ బోర్డుపైనే పలువురి దృష్టి
- అధిష్ఠానాలకు సంక్లిష్టంగా మారిన ఎంపిక

తిరుపతి టీడీపీ నుంచీ పెద్ద సంఖ్యలో ఆశావహులు

కూటమిలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీ నుంచీ ఆశావహులు పెద్దసంఖ్యలో పదవుల కోసం రేసులో వున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తాను టికెట్ త్యాగం చేసినందున దానికి తగ్గట్టుగా ఎమ్మెల్సీ లేదా తుడా చైర్‌పర్సన్ పదవితో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ సైతం తనకు టికెట్ దక్కనందున అధినేత చంద్రబాబు ఏదో ఒక కీలక పదవి కట్టబెడతారని భావిస్తున్నారు. కూటమి అభ్యర్థికి తొలుత మద్దతు ప్రకటించి వెంట ప్రచారానికి వెళ్ళిన టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్ష పదవితో పాటు తుడ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. టికెట్ దక్కనందున అధిష్ఠానం ఈ రెండు పదవులతో న్యాయం చేస్తుందని విశ్వసిస్తున్నారు. మబ్బు దేవనారాయణరెడ్డి తుడా చైర్మన్ గిరీ ఆశిస్తుండగా శ్రీధర్ వర్మ గత ప్రభుత్వంలోనూ పదవి దక్కని నేపథ్యంలో ఈ పర్యాయం తప్పనిసరిగా టీటీడీ బోర్డు మెంబరు పదవి దక్కుతుందని గట్టి నమ్మకంతో వున్నారు. ఆయనకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల మద్దతు వుండడం అదనపు బలం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ ఏకైక కార్పొరేటర్‌గా గెలిచి తిరుపతిలో పార్టీ ప్రతిష్ఠను, ఉనికిని చాటిన ఆర్సీ మునికృష్ణ తుడా అధ్యక్ష పదవి గానీ లేదా టీటీడీ బోర్డు మెంబరు గానీ ఇస్తారన్న నమ్మకంతో వున్నారు. అవి తప్పినా గతంలో గంగమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా గుడిని గణనీయంగా అభివృద్ధి చేసినందున మరోసారి ఆయనకు గంగమ్మ ఆలయ చైర్మన్ పదవి దక్కే అవకాశముంది. ఇక టికెట్ రేసులో చివరికంటా నిలిచి నిరాశకు లోనైన ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పదవి ఆశిస్తున్నారు.

చంద్రగిరి నుంచీ కీలక పదవులు ఆశిస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి పరిస్థితుల కారణంగా ఎమ్మెల్యే పులివర్తి నానీకి గత ప్రభుత్వంలో చెవిరెడ్డికి దక్కిన తరహాలో ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. అదనపు ప్రోటోకాల్ వర్తించేలా ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ పదవులు రెండూ ఆయనకు కేటాయించాలని ఆశిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో తిరుపతిలో పార్టీ గళం వినిపించడంతో పాటు నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఆరంభం నుంచీ తుదికంటా కష్టపడిన రవినాయుడు తుడా పదవితో తన కష్టానికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచీ ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిన డాలర్స్ దివాకర రెడ్డి, బడి సుధా యాదవ్ తుడా లేదా దానికి సమానమైన ప్రాధాన్యత కలిగిన పదవులను ఆశిస్తున్నారు. మరో ముఖ్యనేత వీరపల్లి హేమాంబరధర రావు టీటీడీ బోర్డు మెంబరు పదవిని కోరుకుంటున్నారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ కమ్మ కార్పొరేషన్ అధ్యక్ష పదవిని లేదా ఏదో ఒక కార్పొరేషన్ పదవిని కోరుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ బహిష్కరించినా ఆమె ఒక్కరే ఎంపీటీసీగా పోటీ చేసి బరిలో నిలిచారు. పార్టీ కోసం బాగా కష్టపడ్డారని శ్రేణుల్లో పేరున్న ఆమె పలు క్రిమినల్ కేసులు సైతం ఎదుర్కొంటున్నారు. కాగా శ్రీకాళహస్తి నుంచీ మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల రేసులో మిత్రపక్షాల నేతలు

కూటమిలో మిత్రపక్షాలుగా కొనసాగుతున్న జనసేన, బీజేపీల నుంచీ కూడా పలువురు నేతలు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. జనసేన పార్టీకి సంబంధించి జిల్లా మొత్తం మీద పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ పేర్లే ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టికెట్ జనసేనకు కేటాయించినప్పటికీ స్థానికంగా వున్న వీరిని కాదని ఇతరులకు కేటాయించినందున ఇపుడు నామినేటెడ్ పదవులతో తమకు న్యాయం జరుగుతుందని వీరు భావిస్తున్నారు. వీరిద్దరూ తుడా చైర్మన్ లేదా టీటీడీ బోర్డు మెంబర్ పదవిని ఆశిస్తుండడం గమనార్హం. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో తరచూ పవన్ కళ్యాణ్‌పై విమర్శలకు దిగే అప్పటి మంత్రి రోజాను దీటుగా ఎదుర్కొని క్రిమినల్ కేసులతో, అరెస్టులతో కష్టనష్టాలు అనుభవించిన కిరణ్ రాయల్ తన కష్టాన్ని పార్టీ గుర్తించి న్యాయం చేస్తుందన్న నమ్మకంతో వున్నారు. బీజేపీ విషయానికొస్తే గత ఐదేళ్లలో టీటీడీకి సంబంధించిన అనేక వివాదాస్పద నిర్ణయాలపై నిరసన గళం వినిపించడంతో పాటు న్యాయస్థానాల్లో పోరాడిన భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ బోర్డు సభ్యత్వం ఆశిస్తున్నారు. గత ఈవో ధర్మారెడ్డిని ఎదుర్కొనే క్రమంలో దర్శనాల సదుపాయం కూడా ఆయన కోల్పోయిన సంగతి తెలిసిందే. ఎన్నికల సమయంలో బీజేపీలో చేరిన నవీన్‌కుమార్‌రెడ్డి సైతం టీటీడీ బోర్డు, అధికారుల అనుచిత వైఖరిపై సమర్థవంతంగా పోరాడారు. పలు అంశాల్లో న్యాయస్థానాలనూ ఆశ్రయించారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అండదండలున్నందున తనకు టీటీడీ బోర్డు మెంబరు పదవి దక్కుతుందని నమ్ముతున్నారు. ఇదే కోవలో ఆ పార్టీ నేత సామంచి శ్రీనివాస్ పేరు కూడా వినిపిస్తోంది. శ్రీకాళహస్తికి చెందిన నేత కోలా ఆనంద్ కూడా టీటీడీ పాలకమండలి సభ్యత్వం కోరుకుంటున్నారు.

పదవులు పరిమితం... ఆశావహులు అధికం

జిల్లాలో ప్రధానంగా చెప్పుకోదగ్గ పదవులు తుడా, టీటీడీ పాలకమండలి మాత్రమే వున్నాయి. పార్టీ పదవుల్లో టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంచార్జి పదవులు రెండు మాత్రమే వున్నాయి. టీటీడీ మెంబరుగా జిల్లా నుంచీ ఒకరిద్దరికి మించి అవకాశం దక్కడం కష్టం. కూటమిలో మూడు పార్టీలు వుండడం, రాష్ట్రవ్యాప్తంగా టీటీడీ బోర్డు మెంబరు పదవికి పోటీ వుండడంతో రెండైనా దక్కుతాయో లేదో అనుమానమే. పదవులు పరిమితంగా వుండడం, ఆశావహుల సంఖ్య ఎక్కువగా వుండడం కూటమి పార్టీల అధిష్ఠానాలకు తలనొప్పిగా మారుతోంది. ఈ పార్టీలతో పాటు సామాజిక సమీకరణల సమతుల్యత కూడా పాటించాల్సి రావడంతో పదవులకు నేతలను ఎంపిక చేసే ప్రక్రియ సంక్లిష్టంగా మారుతోంది. ఇన్ని ఇబ్బందుల నడుమ నామినేటెడ్ పదవులు దక్కించుకునే అదృష్టవంతులెవరో వేచి చూడాల్సి వుంది.

కలెక్టర్‌గా వెంకటేశ్వర్

- గతంలో చిత్తూరు జేసీగా అనుభవం
- ఎల్లుండి బాధ్యతల స్వీకరణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 2: తిరుపతి కలెక్టర్‌గా డాక్టర్ వెంకటేశ్వర్ నియమితులయ్యారు. 2016 ఐఏఎస్‌బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వర్ ప్రస్తుతం సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా, ఏపీ వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. 2021లో చిత్తూరు జిల్లా జేసీ(హౌసింగ్)గా పనిచేసిన ఈయన తరువాత జేసీగా 17 నెలల పాటు విధులు నిర్వహించి వైద్యవిధాన పరిషత్‌కు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని ఎడమకల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌ది రైతు కుటుంబం. తండ్రి వెంకటయ్య సర్పంచ్‌గా, తల్లి కాశమ్మ జడ్పీటీసీగా కూడా పని చేశారు. వెంకటేశ్వర్ 2012లో ఆంధ్రా మెడికల్ కళాశాలలో మెడిసిన్ పూర్తి చేశారు. అప్పటి కలెక్టర్, ప్రస్తుత టీటీడీ ఈవో శ్యామలరావు స్ఫూర్తితో కలెక్టర్ కావాలనుకున్నారు. ఎకరా పొలం అమ్మి ఆ డబ్బులతో హైదరాబాద్, ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నారు.2013లో సివిల్స్‌రాసి ఐఆర్ఎస్(ఇండియన్ రైల్వే అడ్మినిస్ట్రేషన్ సర్వీస్)కు ఎంపికయ్యారు.2015లో మూడవ సారి సివిల్స్ పరీక్షలకు హాజరైతే 216వ ర్యాంకు వచ్చింది. సివిల్ సర్వీసెస్ శిక్షణ పూర్తి చేసుకున్నాక 2018లో విశాఖ జిల్లా పాడేరు సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు.ఒకటిన్నర సంవత్సరం తరువాత అక్కడే ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. 2021లో చిత్తూరు జిల్లా హౌసింగ్ జేసీగా బదిలీ అయ్యారు. జిల్లాల పునర్విభజన తరువాత చిత్తూరు జిల్లా జేసీగా 17 నెలలు పనిచేశారు.శుక్రవారం తిరుపతి కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు వెంకటేశ్వర్ తెలిపారు.

● ఛాలెంజ్‌గా భావిస్తున్నా

రాష్ట్రంలోనే ప్రముఖమైన తిరుపతి జిల్లాలో పనిచేయడం ఓ ఛాలెంజ్‌గా భావిస్తున్నా.గతంలో చిత్తూరు జేసీగా పనిచేశాను కాబట్టి తిరుపతిపై అవగాహన వుంది. శ్రీవారి పాదాల చెంత కలెక్టరుగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రయత్నిస్తా.ముఖ్యంగా పబ్లిక్ గ్రీవెన్స్‌పై దృష్టి పెడతా.



- కార్పొరేషన్ అధికారులకు దిశానిర్దేశం
- వెల్లువెత్తుతున్న విమర్శలు

తిరుపతిలో షాడో ఎమ్మెల్యే

తిరుపతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి):తిరుపతి ఎమ్మెల్యే ఎవరు? ఆరణి శ్రీనివాసులు కదా! మరి అధికారులతో సమావేశాలు పెట్టి ఉపన్యాసాలు దంచుతున్న ఈయన ఎవరబ్బా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈయనగారి పేరు ఆరణి శివకుమార్. జనసేన నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులుకు అన్న కుమారుడు. ఎమ్మెల్యే గారు ఎంత బిజీగా ఉన్నారో ఏమో గానీ ఆయన తరఫున అధికారుల బదిలీలు మొదలు..సమీక్షల వరకు అన్నీ శివకుమార్ కానిచ్చేస్తున్నారు. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అదితి సింగ్ పక్కన కుర్చీలో దర్జాగా కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో దిశానిర్దేశం చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది.గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం కమిషనర్‌ను కలిసిన ఆయన పనిలో పనిగా అటెండరు మొదలు కమిషనర్ దాకా అందరూ మంచిగా పనిచేసి ఎమ్మెల్యేకి మంచి పేరు తేవాలని ఉపదేశించారు. ఐఏఎస్ అధికారి అయిన కమిషనర్ కూడా ఈ షాడో ఎమ్మెల్యే ఉపన్యాసాన్ని బుద్ధిగా తల ఊపుతూ వినడమే విచిత్రం. ఎన్నికల సమయంలో తెర వెనుక ఉండి అంతా నడిపిన శివకుమార్ ఇప్పుడు తెరముందుకు వచ్చేశారన్నమాట.



తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పక్కన కుర్చీలో కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో చెబుతున్న శివకుమార్

సదరన్ డిస్కం వెబ్‌సైట్, యాప్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాలి

తిరుపతి(ఆటోనగర్), జూలై 2: సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారానే చెల్లించాలని సీఎండీ కె.సంతోషరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇకపై ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతోపాటు ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులను నేరుగా చెల్లించడానికి వీలుండదన్నారు. తమ సంస్థ మొబైల్ యాప్ లేదా ఏపీఎస్పీడీసీఎల్.ఇన్ ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌లతోపాటు ఇతర యూపీఐ యాప్‌లను ఉపయోగించి చెల్లించాలని సూచించారు. అలాగే నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్‌కార్డులను కూడా వాడుకోవచ్చని వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.91 కోట్లు

తిరుమల, జూలై2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.91 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 75,449 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,121 మంది తలనీలాలు సమర్పించారు.



అయ్యో పాపం..!

● గుర్తుతెలియని వాహనం ఢీకొని వానరం మృతి

తిరుమల రెండవఘాట్‌లో మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వానరం మృతి చెందింది. వేకువజామున రోడ్డు దాటుతున్న వానరాన్ని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వానరం అక్కడికక్కడే మృతి చెందింది. వెనుక వచ్చిన వాహనదారులు చనిపోయిన వానరాన్ని రోడ్డు పక్కకు జరిపి వెళ్లిపోయారు. దానిని చూసిన పలువురు భక్తులు అయ్యో పాపం అంటూ చింతించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 2: మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో మంగళవారం అధికారులు, స్థానికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి రానున్న దృష్ట్యా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. విద్యుత్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసులు, ఉభయదారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా భక్తులు రావడానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఈవో యువరాణి, విద్యుత్ శాఖ ఈఈ వాసుదేవరెడ్డి, సీఐ శ్రీరాముడు, ఎంపీడీవో నాగేంద్రబాబు, డిప్యూటీ తహశీల్దార్ మోహన్, తిరుపతి ఆర్టీసీ డీఎం బాలాజీ, డాక్టర్ మురళీకృష్ణ, ఎంఈవో బాబ్జీ, సీనియర్ టీడీపీ నాయకుడు వలపల దశరథ నాయుడు, మండల పార్టీ కన్వీనర్ నాగారాజ నాయుడు, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, నాయకులు చంద్రశేఖర్ నాయుడు, బుజ్జి, వి.రవీంద్రబాబు, వివి.రమణ, కృష్ణమూర్తి, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కోసం ఒక మొక్క



డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 2: డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు రామచంద్రాపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మంగళవారం మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా కార్యదర్శి హరినాథరెడ్డి మాట్లాడుతూ దేశంలో వేడి తాపాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. బీజేపీ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి రాటకొండ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి వెంకటముని, కార్యదర్శి కాయం హరినాథరెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మునెయ్య, శివ, శంకర్‌రెడ్డి, చండేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై తిరుమలకు టీడీపీ కార్యకర్తలు



చంద్రగిరి, జూలై 2: చంద్రగిరి మండలం, కందులవారిపల్లెకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వల్లూరి శ్రీకాంత్‌చౌదరి, దేశినేని వాసుదేవ నాయుడు, భీమవరానికి చెందిన పెండ్యాల చంద్రమౌళి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రగిరిలో ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపొందడంతో మంగళవారం శ్రీవారిమెట్టు మార్గంలో మోకాళ్లపై తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. చంద్రబాబు సీఎం కావాలని, చంద్రగిరిలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలుపొందితే మోకాళ్లపై శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకొంటామని మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో మంగళవారం ఉదయం శ్రీవారిమెట్టు వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, గోవిందనామ స్మరణతో మోకాళ్లపై తిరుమలకు వెళ్లారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చంద్రగిరి, జూలై 2: మండలంలోని రెండు ప్రాంతాలలో మంగళవారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. చంద్రగిరి కొత్తపేట, రామిరెడ్డిపల్లెలో మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, గర్భాశయ ముఖద్వార పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కల్యాణ వెంకన్న ఆలయ శుద్ధి

చంద్రగిరి, జూలై 2: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. గురువారం ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ సందర్భంగా తిరుప్పావ, ఆర్జిత కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

భాకరాపేట, జూలై 2: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చునని ఎంపీడీవో సోమశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లులో అతిసార వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన సురక్షితమైన తాగునీటిని ఉపయోగించుకోవాలన్నారు. వైద్యాధికారులు తేజస్విని, హేమంత్ కుమార్ రెడ్డి, సీహెచ్‌వో శేషుకుమారి, ఎంపీహెచ్‌ఈవో అమరనాథరెడ్డి, సూపర్‌వైజర్లు సుబ్రహ్మణ్యం, వసంతకుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

సత్యవేడు, జూలై 2: గంజాయి కేసులో సత్యవేడు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కిలో గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శ్రీకాళహస్తి మార్గంలో కాళమనాయుడుపేట వద్ద మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులను పోలీసు సిబ్బంది ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా బైక్‌ట్యాంక్ కవరులో గంజాయి బయటపడింది. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు యువకులను అదుపులో తీసుకుని విచారించగా సత్యవేడు గంగమిట్ట వీధికి చెందిన కుమార్(25), దళితవాడకు చెందిన కాళీయప్ప(22)గా తెలిసింది. వారు వారు గంజాయి అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.ఐదువేలు, ద్విచక్ర వాహనం విలువ రూ. 50 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నిందితులు సూళ్లూరుపేటలో గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులు ఉదయమే పట్టుబడ్డా పొద్దుపోయే వరకు సంబంధిత వివరాలను మీడియాకు వెల్లడించకుండా పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు దారితీసింది. ఈ విషయమై సీఐ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా నిందితుల విచారణ, కేసు నమోదు తదితర ప్రొసీజర్ ఆలస్యం కావడంతో ప్రెస్‌మీట్ పెట్టలేకపోయామని ఆయన చెప్పడం కొసమెరుపు.

శ్రీవారిమెట్టు మార్గానికి దారెటు...?

● అండర్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు ● సూచిక బోర్డుల్లేక ఇబ్బందులు పడుతున్న భక్తులు



శ్రీనివాసమంగాపురం మార్గంలో కనిపించని సూచిక బోర్డులు

చంద్రగిరి, జూలై 2: తిరుమల శ్రీవారి దర్శనానికి కాలినడక మార్గమైన శ్రీవారిమెట్టు వద్దకు వెళ్లేందుకు దారి ఎటో తెలియక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం వద్ద నుంచి శ్రీవారిమెట్టుకు వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ ఉండటంతో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. సంబంధిత రైల్వే కాంట్రాక్టర్ కళ్యాణి వాగు పక్క నుంచి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులు శ్రీనివాసమంగాపురం వద్దకు రాగానే.. శ్రీవారిమెట్టు వద్దకు వెళ్లే దారి తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ శ్రీవారిమెట్టు మార్గానికి వెళ్లే సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రత్యామ్నాయంగా వేసిన రోడ్డులో రెండు నెలలుగా కంకర పోసి, బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారు. ఆ దారిలో కంకర తేలి ద్విచక్ర వాహనాలు, భక్తులు కాలినడకన వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో వెళ్లాలంటే టైర్లు పంక్చర్లు అవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా కంకర రోడ్డుపై వెళ్లాలంటే టైర్లు పంక్చర్ అవుతాయని ముందే చెప్పి శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు వరకు సాధారణ ధరకన్నా అధిక ధరను భక్తుల వద్ద నుంచి ఆటో డ్రైవర్లు వసూలు చేస్తున్నారు. టీటీడీ స్పందించి శ్రీవారిమెట్టు మార్గంలోని ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టి, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



బీటీ రోడ్డు వేయని ప్రత్యామ్నాయ మార్గం

కాలినడక భక్తుల భద్రతకు ప్రాధాన్యమివ్వండి

● జంతువుల కదలికలు తెలిసేలా చర్యలు తీస్కోండి
● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై2(ఆంధ్రజ్యోతి): అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గంలో వెళ్లే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో ప్రభుత్వ అటవీ, టీటీడీ అటవీ, ఇంజనీరింగ్, భద్రత విభాగాలతో కాలిబాట భక్తుల భద్రత చర్యలపై మంగళవారం ఈవో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాలే కాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకునేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి ఏడవ మైలు వరకు సంచరించే జంతువుల కదలికలు ఎప్పటికప్పుడు కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంతువుల కదలికలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు భద్రతా విభాగానికి తెలియజేయడం ద్వారా భక్తులను హెచ్చరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సంయుక్త కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు చాలా ఖర్చుతో కూడుకున్నవని, తక్కువ ఖర్చుతో అయ్యే నిర్మాణాలను, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని కమిటీకి ఉత్తరం రాయాలని అధికారులను ఆదేశించారు. కాలినడక మార్గంలో ఏయే సమయాల్లో భక్తుల రాకపోకలు అధికంగా, తక్కువగా ఉన్నాయి.. ఏ సమయాల్లో చిరుతలు ఈ ప్రాంతాల్లో తిరుగుతున్నాయి.. తదితర సమాచారాన్ని అటవీ అధికారులు పీపీటీ ద్వారా వివరించారు. నిర్దేశించిన సమయాల్లోనే కాలినడక భక్తులు తిరుమలకు చేరుకునేలా ఆయా సమయాల్లో మార్పులు చేయవల్సిందిగా ఈవో దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవాలని జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్‌కు ఈవో సూచించారు. అంతకుముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త కమిటీ ప్రతిపాదనలు, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారిచ్చిన ప్రతిపాదనలను అటవీ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సంబంధిత ప్రతిపాదనలలో ఏ పనులు చేపట్టారు, ఎన్ని పురోగతిలో ఉన్నాయి, ఇంకా ఎన్ని పనులు చేయాలనే అంశాలపై ఈవో సమీక్షించారు. ఎస్వీ జ్యూపార్క్ క్యూరేటర్ సెల్వం, తిరుపతి డీఎఫ్‌వో సతీష్, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాస్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యమ్మ గంగజాతర

పాకాల, జూలై 2: పాకాల గ్రామదేవత సత్యమ్మ గంగజాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ప్రతిమ ప్రతిష్ఠాపన చేసి పొంగళ్లు, అంబలి నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. జాతరను పురస్కరించుకొని ఎమ్మెల్యే పులివర్తి నాని పూజాద్రవ్యాలు, పూలు, పండ్లు, పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. జాతర నిర్వాహకులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



సత్యమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

వాతావరణ మార్పులతో తగ్గుతున్న పంటల దిగుబడి



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

భాకరాపేట, జూలై 2: వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పంటల దిగుబడి తగ్గిపోతుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ భాస్కరయ్య తెలిపారు. చిన్నగొట్టిగల్లు వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు వాతావరణ మార్పులు-పంటల దిగుబడిపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు ధనలక్ష్మి, వేణుగోపాల్‌రావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

ఎర్రావారిపాలెం, జూలై 2: రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునని ఏడీ భాస్కరయ్య అన్నారు. మండలంలోని నెరబైలు రైతు భరోసా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సాగుపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. వేరుశనగలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రిసోర్స్ పర్సన్ వేణుగోపాల్ వివరించారు. ఏఓ ఖాదర్ బాషా, విస్తరణాధికారి నళిని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముగం

రామచంద్రాపురం, జూలై 2: ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు కలుగుతుందని వ్యవసాయ శాఖ డీపీఎం షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని అనుపల్లి, సి.కాలేపల్లి, నెత్తకుప్పం, వేపకుప్పం, రాయలచెరువు, కుప్పంబాదూరుతో పాటు పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయపద్ధతుల్లో సాగు చేస్తున్న రైతుల పొలాలను సందర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పీఎండీఎస్ వేయాలన్నారు. అధికారులు సురేంద్రరెడ్డి, పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

99.6 శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 2: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు రెండో రోజైన మంగళవారం సచివాలయ సిబ్బందితో 99.6శాతం పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్డీఏ పీడీ ప్రభావతి తెలిపారు. తొలిరోజున దాదాపు 95శాతంపైగా వృద్ధాప్య, మిగతా పింఛన్ల పంపిణీ జరిగింది. 2,69,162కుగాను 2,66,636 పింఛన్ల పంపిణీ పూర్తయింది. దాదాపు రూ.180.63కోట్ల పింఛను నగదు అందజేశారు. మిగిలిన 0.4 శాతంలో మృతి చెందినవారు, ఊర్లో లేనివారు మాత్రమే ఉన్నారని గుర్తించారు.

మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని పోలీస్ అవుట్‌పోస్టు



రాయలచెరువు కట్టపై నిరుపయోగంగా ఉన్న పోలీస్ అవుట్ పోస్టు

రామచంద్రాపురం, జూలై 2: నిర్మానుష్య ప్రదేశంలో ప్రజలను కాపాడటానికి మూడేళ్ల క్రితం రాయలచెరువు కట్టపై ఏర్పాటు చేసిన పోలీసు అవుట్‌పోస్టు ను ఎపుడు ప్రారంభిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాయలచెరువు కట్టకు కిలోమీటరు దూరంలో ఎలాంటి గ్రామాలు లేకపోయినా ఆర్‌సీపురం మండల ప్రజలకు మూడు రోడ్ల కూడలైన ఇక్కడి నుంచి అనేక ప్రాంతాలకు రాకపోకలు సాగుతుంటాయి. కార్వేటినగరం మీదుగా పళ్లిపట్టుకు, అనుపల్లి నుంచి చిత్తూరుకు, బాదూరు నుంచి పుత్తూరుకు కట్టపై నుంచి బస్సులు వెళతాయి. ప్రయాణికులు ఒక్కోసారి గంటల తరబడి రాయలచెరువు కట్టపై బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. కొన్ని బస్సు సర్వీసులు రాత్రి 10గంటలకు కూడా రాయలచెరువు కట్ట వద్ద ప్రయాణికులను దించి వెళతాయి. ఈ ప్రదేశం నిర్మానుష్యంగా ఉంటుంది. రాయలచెరువులో కొన్నాళ్ల క్రితం ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రాయలచెరువు కట్ట చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో కొంతమంది జూదం, మద్యం సేవించడం చేస్తుంటారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల క్రితం అప్పటి ఎస్ఐ జయస్వాములు రాయలచెరువు కట్టపై పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటుకు కృషి చేశారు. అనంతరం ఇది ప్రారంభానికి నోచుకోలేదు. పోలీసు అవుట్‌పోస్టు ప్రారంభిస్తే అసాంఘిక శక్తుల కట్టడితో పాటు ప్రయాణికులకు కూడా భద్రత ఏర్పాటుచేసినట్లు అవుతుంది. వెంటనే పోలీస్ అవుట్‌పోస్టును ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

పాపవినాశనంలో దుకాణదారుల మధ్య వాగ్వాదం

తిరుమల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాపవినాశంలో మంగళవారం దుకాణదారులమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి అనుమతులు లేకపోయినప్పటికీ కొంతమంది వ్యక్తులు తీర్థానికి సమీపంలో దుకాణాలు పెట్టే ప్రయత్నం చేయగా, అక్కడ అధికారికంగా ఉన్న దుకాణదారులు ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తమ దుకాణాల ముందు ఎలా పెడతారంటూ ఆగ్రహించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. ఒకరిపై ఒకరు కాలుదువ్వుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడే ఉన్న కొందరు వ్యాపారులు డయల్ 100కు సమాచారమిచ్చారు. దీంతో తిరుమల టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి చక్కబడింది. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. వాగ్వాదానికి దిగిన వర్గాల్లో ఒక వర్గం ట్రైబల్స్ కావడంతో పోలీసులు సమస్యను పరిష్కరించే దిశగా కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

దొంగల ముఠా అరెస్టు



దొంగల ముఠాను అరెస్టు చూపుతున్న సీఐ మల్లికార్జున్

రేణిగుంట, జూలై 2: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక బంగారు చైను స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట సీఐ మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామా నగర్‌లో పోలీసులు గాలింపు చేపట్టారు. పోలీసులను గమనించిన కొంత మంది పారిపోయేందుకు యత్నించగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తిరుపతి మారుతీ నగర్‌కు చెందిన జశ్వంత్, సంజీవనగర్‌కు చెందిన సతీష్, కోలా వీధికి చెందిన జశ్వంత్, ప్రసన్నకుమార్, భవానీనగర్‌కు చెందిన వేముల చరణ్, రఘునాథ్‌రెడ్డి కాలనీకి చెందిన రియాజ్, పాకాలకు చెందిన దిలీప్‌గా తెలిసింది. ఇది వరకే వీరిపై తమిళనాడు తిరువల్లూరు, తిరుచానూరు, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి దోపిడీ, చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ల చోరీ కేసులు కేసు నమోదైనట్లు తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తర లించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, రైటర్ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను తొలగించాలని ఎంపీడీవోకు వినతి



రామచంద్రాపురం, జూలై 2: కమ్మపల్లెకు ఒక వ్యక్తి నకిలీ ధ్రువ పత్రాలతో పింఛను తీసుకుంటున్నాడని ఎంపీడీవోకు గ్రామ టీడీపీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నీలకంఠచౌదరి, సురేష్‌నాయుడు మాట్లాడుతూ కమ్మపల్లి గ్రామానికి చెందిన మురళీకృష్ణ ఆరోగ్యం బాగున్నప్పటికీ వికలాంగ నకిలీ ధ్రువపత్రాలు సృష్టించుకుని దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నట్లు రూ.10వేలు పింఛను పొందుతున్నాడన్నారు. అధికారులు అతడి ధ్రువపత్రాలను పరిశీలించి పింఛన్‌ను రద్దు చేయాలన్నారు. పింఛను జాబితాను పరిశీలించి అనర్హులను తొలగించాలని కోరారు.

అర్హులకే పింఛన్లు ఇవ్వండి

చంద్రగిరి, జూలై 2: చంద్రగిరి మండలంలో నిజమైన అర్హులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇవ్వాలని, అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి, అనర్హులను తొలగించాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శివకోటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో అనేకమంది అనర్హులు దొంగ సర్టిఫికెట్లు సమర్పించి పింఛన్లు పొందుతున్నారని తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు ఇవ్వడంలేదని, ఆర్థికంగా స్థిరపడి, తమ పిల్లలు అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్న వారు కూడా ప్రభుత్వ పింఛన్లు తీసుకొంటున్నారని, దీని వలన నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



మళ్లీ బడికి....

ఎర్రావారిపాలెం, జూలై 2: బడి మానేసిన ఒక విద్యార్థిని ఎంఈవో మళ్లీ పాఠశాలలో చేర్పించారు. ఎర్రావారిపాలెం మండలం వీఆర్ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి ఇంటి పరిస్థితులు సహకరించకపోవడంతో బడి మానేశాడు. నేను బడికొస్తా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంఈవో-2 సతీష్‌బాబు అతడి తల్లిదండ్రులకు నచ్చజెప్పి తిరిగి పాఠశాలలో చేర్పించారు.

వైభవంగా నడివీధి గంగమ్మజాతర



భక్తులకు అంబలి ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న బడి సుధాయాదవ్

తిరుపతి రూరల్, జూలై 2: తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీలోని రజక కాలనీ, బాలాజీనగర్‌లో మంగళవారం నడివీధి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున అంబలిపోసి, ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామసర్పంచ్, ఓబీసీఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి, మొక్కు చెల్లించారు. భక్తులకు అంబలి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

వకుళమాత ఆటోస్టాండ్ ప్రారంభం



తిరుపతి రూరల్, జూలై 2: తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో మంగళవారం వకుళమాత ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప, ఎస్వీయూ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.సుబ్రమణ్యం, అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షుడు ఎం.పద్మనాభం, కార్యదర్శి కె.మధు, ఉపాధ్యక్షుడు కె.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర



తిరుమలనగర్ జాతరలో పాల్గొన్న స్థానికులు

మంగళం, జూలై 2: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో ముత్యాలమ్మ, జయశంకర్‌కాలనీలోని నడివీధి గంగమ్మ జాతరలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి స్థానిక మహిళలు అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిరుమలనగర్ ముత్యాలమ్మ అమ్మవారిని ఆరణి శివకుమార్, చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దేవర మనోహర్ దర్శించుకున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

తిరుచానూరు, జూలై 2: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

మానసిక, శారీరక ఒత్తిడితో అనారోగ్య సమస్యలు

తిరుపతి(వైద్యం), జూలై 2: మానసిక, శారీరక ఒత్తిడితో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. వీటిని ఎదుర్కోవాలంటే శ్వాస వ్యాయామాలు చేయడం ఎంతో మంచిదని సూచించారు. స్విమ్స్‌లోని ఫిజియోథెరపీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఏరోబిక్స్ నిపుణులతో విద్యార్థులకు ఏరోబిక్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, డాక్టర్లు విశ్వనాథ్, సురజిత్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రచయితలకు పురస్కారాలు

తిరుపతి (కల్చరల్), జూలై 2: కెనడా దేశంలో తెలుగుతల్లి మాసపత్రిక నిర్వహించిన కవితలు, కథల పోటీల్లో ముగ్గురు రచయితలకు పురస్కారాలు లభించాయి. తిరుపతికి చెందిన కథకుడు, కవి పేరూరు బాలసుబ్రమణ్యం నాన్న కవితకు, చిత్తూరుకు చెందిన ఎం.ఆర్.అరుణకుమారి రాసిన మరుజన్మకు నువ్వే కథకు, రాచపూటి రమేష్ కథ ఆ నాటి చెలిమికి బహుమతులు ప్రకటించారు.

వాటర్ ఫిల్టరు వితరణ



తిరుపతి(వైద్యం), జూలై 2: రుయా చిన్నపిల్లల విభాగం పరిధిలోని ఆర్‌బీఎస్‌కే కేంద్రానికి వుయ్ సపోర్టు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు తహస్సు బేగం ఓ ఆర్వో వాటరు ఫిల్టరును మంగళవారం వితరణ చేశారు. దీన్ని డీఎంహెచ్‌వో శ్రీహరికి అందజేశారు. వీరిలాగే మరికొందరు దాతలు ముందుకు రావాలని శ్రీహరి కోరారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు ప్రదీప్, పద్మావతి, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ రెజ్లింగ్ టోర్నీలో హర్షిత ప్రతిభ



తిరుపతి (క్రీడలు), జూలై 2: తమిళనాడు మిట్టూరుడ్యాం జిల్లాలో జరిగిన సౌత్‌జోన్ అండర్ 23 రెజ్లింగ్ టోర్నీలో వెదురుకుప్పం మాంబేడు గ్రామానికి చెందిన కొణిదల హర్షిత ప్రతిభ కనబరిచింది. 57కిలోల విభాగంలో కాంస్యం, మట్టికుస్తీ విభాగంలో రజత పతకాలు సాధించింది. ఈమె శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆరు నెలలుగా శాప్ రెజ్లింగ్ శిక్షకురాలు హిందూజ వద్ద శిక్షణ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీనివాస క్రీడాసముదాయంలో క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ ఆధ్వర్యంలో హర్షితను సత్కరించారు. ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోచ్ ప్రేమనాథ్, రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి ఫోర్స్ బస్సులు



తేజోమూర్తికి బస్సు తాళాలు అందజేస్తున్న శివప్రసాద్

రేణిగుంట, జూలై 2: తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శ్రీ దుర్గా ఫోర్స్ షోరూమ్‌లో మంగళవారం ఫోర్స్ స్కూల్ బస్సులను మార్కెట్లోకి విడుదల చేశారు. వీటిని చిత్తూరుకు చెందిన విజయం గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత తేజోమూర్తి మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్, ఫోర్స్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ నుంచి 55 సీట్ల కెపాసిటీతో స్కూల్ బస్సులను విడుదల చేశామన్నారు. మోనోకోక్ బాడీతో ఉన్నతమైన పారాబోలిక్ సస్పెన్షన్‌తో ప్యాసింజర్లకు కారులో తిరిగే అనుభూతితో మంచి మైలేజి కలిగి ఉండటం ఈ బస్సుల ప్రత్యేకత అని చెప్పారు.

పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచండి

మంత్రి నారా లోకేశ్‌కి వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల వినతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 2: ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే యూనివర్సిటీ ఉద్యోగులకు కూడా పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని మంత్రి నారా లోకేశ్‌ని నాన్ టీచింగ్ అసోసియేషన్ కోరింది. విజయవాడలో మంగళవారం ఆయన్ను కలిసిన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.కె.సుబ్రమణ్యం, రవికుమార్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డులు



మాధవిని అభినందిస్తున్న ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), జూలై 2: స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవికి రెండు ప్రత్యేక అవార్డులు వచ్చాయని డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను తన ఛాంబర్‌లో అభినందించారు. ఆయన మాట్లాడుతూ కోయంబత్తూరులో గత నెల 16న నెహ్రూ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపి వారు నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్‌లో మిలియన్ అవార్డును, 30వ తేదీన హైదరాబాద్‌లో అపోలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి వారు నిర్వహించి రెండో ప్రపంచ కాంగ్రెస్ ఫిజికల్ థెరపీలో ఫిజియో ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారని వివరించారు.

రేపు విద్యాసంస్థల బంద్



కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 2: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎస్వీయూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఏఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఏ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌వో సంఘాలు ఈ బంద్‌లో భాగస్వామ్యం వహించనున్నాయి. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విలువైన సమయాన్నీ, శ్రమనూ, డబ్బునూ, భవిష్యత్తునూ నాశనం చేశారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నవీన్ (ఏఐఎస్ఎఫ్), మల్లికార్జున (ఎన్ఎస్‌యూఐ), అక్బర్ (ఎస్ఎఫ్ఐ), తదితరులు పాల్గొన్నారు.

ఏంటి 'మాస్టర్' ఈ రోడ్డు?

నాలుగు నెలలకే డొల్లగా మారిన కులశేఖర్ మార్గం - హడావుడిగా అతుకులు







"శ్రీకులశేఖర్ ఆళ్వార్ మార్గం మాస్టర్ ప్లాన్ రోడ్లకే తలమానికంగా నిలుస్తుంది. తిరుపతి భవిష్యత్తును మారుస్తుంది."

రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా వైసీపీ నాయకులు గొప్పగా చెప్పిన ఈ మాటల వెనుక డొల్లతనాన్ని వేసిన నాలుగు నెలలకే ఈ రోడ్డు నిరూపించేసింది. హీరో షోరూమ్ రైల్వే గేట్- కాటన్ మిల్ ప్రాంతాన్ని కలుపుతూ దాదాపు 8కోట్ల రూపాయలు ఖర్చుచేసి 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు వేశారు. ఒకవైపు నేతాజి సుభాష్ చంద్రబోస్, మరోవైపు చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురుల విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఎన్నికల కోడ్ వచ్చేస్తుందనే హడావుడితో శ్రీకులశేఖర్ ఆళ్వార్ మార్గంగా పేరు పెట్టి మార్చి 13న అట్టహాసంగా ప్రారంభించేశారు. అయితే నాలుగు నెలలన్నా తిరక్కుండానే రోడ్డుపైన తారు ఉబ్బి పైకి లేచిపోయింది. అక్కడక్కడా కుంగిపోయి గుంతలు పడ్డాయి. ఎక్కడ తమ నెత్తికి వస్తుందనుకున్నారేమో గానీ అధికారులు హడావుడిగా ఎక్స్‌కవేటర్ పెట్టి తవ్వి.. అతుకులు వేసే పని మొదలు పెట్టారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అసంపూర్తిగా కాలువ నిర్మాణం

దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు



అసంపూర్తిగా కాలువ నిర్మాణం - పెద్దకుంటను తలపిస్తున్న మురుగు

తిరుపతి (జీవకోన), జూలై 2: అక్కారంపల్లె వద్ద (ఒకటవ డివిజన్) ఏడాది క్రితం తిరుప్పావై మార్గాన్ని నూతనంగా నిర్మించారు. ఈ మార్గంలో కాలువ అసంపూర్తిగా ఉండటంతో పెద్దకుంటను తలపించేలా మురుగంతా ఒక్కచోటే దర్శనమిస్తోంది. దీన్నుంచి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువైంది. చినుకు పడితే మురుగంతా రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో అక్కారంపల్లె, కొత్తపల్లె కాలనీలకు చెందినప్రజలంతా వెళతుంటారు. కూత వేటు దూరంలోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కూడా ఉన్నాయి. స్థల సేకరణ సమస్య వచ్చిందని కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలేశారని సమాచారం. ఇకనైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

స్విమ్స్‌లో రోగికి పింఛను అందజేత



రోగికి నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది, జనసేన నేతలు

తిరుపతి(వైద్యం), జూలై 2: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగి వద్దకే సచివాలయ సిబ్బంది, జనసేన నేతలు వచ్చి పింఛను నగదు అందించారు. ఆటో నగర్‌కు చెందిన పొన్నాల కృష్ణన్ తీవ్ర అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బాధితుడికి పింఛను నగదును అందించేందుకు సచివాలయ అడ్మిన్ గీత, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి మంగళవారం స్విమ్స్‌కు వచ్చారు. చికిత్స పొందుతున్న కృష్ణన్‌కు నగదు అందజేశారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడికొచ్చి పింఛను నగదు అందజేయడం ఆనందంగా ఉందని లబ్ధిదారుడు, ఆయన కుటుంబీకులు అన్నారు. జనసేన నేతలు రమేష్, పురుషోత్తం, సాయి, సుజీత్, నవీన్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీ ఉద్యోగులకు జీతాలు అందేనా..!



తిరుపతిరూరల్, జూలై 2: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో రాయలసీమ జోన్, కోస్టల్ ఆంధ్రా జోన్‌లో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులకు జూన్ నెలకి సంబంధించిన జీతాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. నిధుల కొరత(బడ్జెట్) వల్ల ఈ రెండుజోన్లకు సంబంధించిన రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు కొంత ఆలస్యమయ్యే పరిస్థితి ఉందని వర్సిటీ అధికార వర్గాలు అంటున్నాయి. వర్సిటీ పరిపాలనా విభాగం(హెడ్ ఆఫీస్)లో పనిచేసే ఉద్యోగులకు ఈనెల ఒకటో తేదీనే జీతాలు అందగా.. ఇదే జోన్లకి చెందిన పెన్షనర్లు, ఆప్కాస్ (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగులకు కూడా ఇప్పటికే జీతాలను అప్‌లోడ్ చేసినట్లు సమాచారం. వర్సిటీకి ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ కింద మార్చి నెలలో అప్పటి ప్రభుత్వం నాలుగు నెలల వేతనాలకు సంబంధించి అడిషనల్‌గా రూ.23కోట్లని మంజూరు చేసింది. ఆ బడ్జెట్ ప్రకారం జూన్ నెలవరకు ఉద్యోగుల వేతనాలకు సరిపోతుంది. అయితే ఇందులో రూ.8కోట్లను మార్చి నెలలోనే పెన్షనర్ల బెనిఫిట్స్ కింద అప్‌లోడ్ చేశారు. మిగిలిన రూ.15కోట్లను ఫైనాన్షియల్ ఇయర్ చివరిలో అంటే మార్చి నెలాఖరులో క్లోజ్ చేశారు. ఈక్రమంలో ఏప్రిల్ నెలలో ట్రెజరీకి క్రెడిట్ కావాల్సిన రూ.15కోట్లు జమకాలేదు. దాంతో ఒకనెల షార్టేజ్ కావడంతో ఉద్యోగులకు ఈనెల జీతాలు అందడం కొంత ఆలస్యం కానుంది. ఇదిలా ఉండగా వర్సిటీ పరిధిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు అప్‌లోడ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి రెండునెలల నుంచి వేతనాలు అందని పరిస్థితి ఉంది. ఇన్‌చార్జ్ వీసీగా పనిచేసిన గోపాలకృష్ణ ద్వివేది.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రోజు నుంచి ఒక ఫైల్ కూడా అప్రూవల్ చేయకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలతోపాటు వర్సిటీలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఏ ఫైల్ కూడా ముందుకు కదలని పరిస్థితి ఉందని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. వర్సిటీ హెడ్ కేంద్రంతోపాటు రెండుజోన్లకి సంబంధించిన ఉద్యోగులకు నెలకు రూ.8.5నుంచి రూ.9కోట్ల జీతాలు చెల్లించాలి. హెడ్ ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగులసంఖ్య తక్కువగా ఉండడంతో వర్సిటీ అకౌంట్‌లో ఉన్న నగదును జీతాలకింద అప్‌లోడ్ చేశారు. దాంతో మిగిలిన ఉద్యోగులు జూన్ నెల జీతాలు తమకు ఎప్పుడు అందుతాయోనని ఎదురుచూస్తున్నారు.

బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్న సోమశేఖర్

కలికిరి, జూలై 2: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు మంగళవారం కలికిరి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కూడిన కమిటీ అర్హులైన విద్యార్థులను పారదర్శక పద్ధతిలో ఎంపిక చేసింది. గత వారం మిగులు సీట్ల భర్తీ కోసం జిల్లా స్థాయిలో కలికిరి గురుకుల పాఠశాలలో అర్హత పరీక్షలు నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులను 1:2 నిష్పత్తిలో కౌన్సెలింగ్ కోసం ఎంపిక చేశారు. మంగళవారం బాలురకు మాత్రం కౌన్సెలింగ్‌ను పరిమితం చేశారు. బుధవారం బాలికల సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సదుం, సత్యవేడు, ఐతేపల్లె, తంబళ్లపల్లె (అంగళ్లు), కుప్పం పాఠశాలల్లో 6వ తరగతిలో అందుబాటులో ఉన్న 51 సీట్లు, 7వ తరగతిలో 20 సీట్లు, 8వ తరగతిలలో 36 సీట్లు, 9వ తరగతిలో 51 సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. మొదట విద్యార్థులతోపాటు హాజరైన తల్లిదండ్రులకు సీట్ల ఎంపిక విధానాన్ని గురించి కన్వీనరు, కలికిరి పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ అవగాహన కల్పించారు. కౌన్సెలింగ్ నిర్వహణలో సదుం, ఐతేపల్లె, సత్యవేడు, తంబళ్లపల్లె, కుప్పం, కలికిరి పాఠశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు రెడ్డి, దేవి సులోచన, శ్రీనివాసులు, రామాంజనేయ రెడ్డి, సరోజ, సోమశేఖర్ పాల్గొన్నారు.

రుయా రక్తనిధి సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు

మూడేళ్లుగా నిలిచిన ఇంక్రిమెంట్లు



తిరుపతి(వైద్యం), జూలై 2 : రుయాస్పత్రిలో రక్త నిధి సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు, మూడేళ్లుగా ఇంక్రిమెంట్లు అందలేదు. రక్తనిధి కేంద్రంతోపాటు బయట రక్తదాన శిబిరాలు నిర్వహించి దాతల నుంచి రక్తం సేకరించేందుకు ఒక ప్రత్యేక మొబైల్ వాహనం అందుబాటులో ఉంది. వీటి నిర్వహణకు ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీఎస్ఏసీఎస్) కింద ఆరుగురు టెక్నీషియన్లతోపాటు ఇద్దరు ల్యాబ్ అటెండర్లు, వాహనం డ్రైవరు, సహాయకుడు, అటెండరు మొత్తం 11 సిబ్బందిని నియమించారు. వీరు మొబైల్ వాహనం ద్వారా బయట రక్తదాన శిబిరాలు నిర్వహించి నెలకు 200 నుంచి 250 యూనిట్ల రక్తాన్ని సేకరించడంతోపాటు దాన్ని భద్రపరిచి అవసరమైన రోగులకు అందజేస్తారు. వీరికి 2022 వరకు జీతాలు సక్రమంగా వచ్చేవి. 2022లో వీరిని డైరెక్టర్ ఆఫ్ జనరల్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) కిందకు తీసుకొచ్చాక జీతాలు సక్రమంగా రావడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికితోడు మూడేళ్ల వ్యవధిలో ఇంక్రిమెంట్లు కూడా పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సూపరింటెండెంట్ రవిప్రభు మాట్లాడుతూ.. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కింద పనిచేస్తున్న రక్తనిధి సిబ్బందితో మరొక విభాగాన్ని విలీనం చేస్తున్న క్రమంలో జీతాలు రావడం ఆలస్యమైందన్నారు. మరో వారం రోజుల్లో వీరికి జీతాలు అందుతాయన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం?



పట్టలు లేకుండా ట్రాక్టరు ట్రక్కులో వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

తిరుపతి(కొర్లగుంట), జూలై 2: నగరంలో చెత్త, ఇతర వ్యర్థాలను తరలించే పారిశుధ్య విభాగం నిర్లక్ష్యం వీడడంలేదు. ప్రతి వీధి నుంచి ఓ ట్రాక్టర్ ట్రక్కు నిండా వ్యర్థాలను తూకివాకం వరకు తరలిస్తారు. ట్రక్కు పూర్తిగా నిండిన తర్వాత చెత్త జారకుండా తారుపట్టలతో కప్పి తరలించాలి. కొన్ని నెలలుగా అలాంటి ఏర్పాట్లు లేకుండానే ట్రక్కు పైభాగంలో కూలీలను కూర్చోబెట్టి తరలిస్తున్నారు. గుంతలు, వేగనిరోధకాలు, మలుపుల వద్ద ట్రక్కు నుంచి చెత్తజారి రోడ్డుపై పడుతోంది. దీనివల్ల వెనుక వస్తున్న వాహనచోదకులకు ఇబ్బందికరంగా ఉంటోంది. కొన్నిసార్లు కాగితాలు గాలికి మొహం పడుతూ ప్రమాదాలకు దారితీస్తోంది. కుళ్లిన చెత్త పాదచారులపై పడిన సందర్భాలూ ఉన్నాయి. ఇకనైనా పారిశుధ్య విభాగం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.



చెట్ల కొమ్మలతో మంటలార్పుతున్న సిబ్బంది

తిరుమల ఘాట్‌లో కార్చిచ్చు

తిరుమల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటిఘాట్‌రోడ్డులోని అడవిలో మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమైన భక్తుల్లో కొంతమంది 31వ మలుపు వద్ద పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా కర్పూరం వెలిగించి వెళ్లిపోవడంతో గాలికి మంటలు చెలరేగాయి. గుర్తించిన వాహనదారులు ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు ఘటనా ప్రాంతానికి చేరుకుని పచ్చి చెట్ల కొమ్మలు, బాటిళ్ల ద్వారా నీళ్లు చల్లి మంటలను అదుపుచేశారు.

పెట్రోలు బంకుల్లో నిబంధనలు తూచ్

కొలతల్లో తేడాలు.. సౌకర్యాలూ నిల్ - గగ్గోలు పెడుతున్న వాహనదారులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 2: పెట్రోలు బంకుల్లో నిబంధనలు పాటించడం లేదని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. కొలతల్లో తేడాలతో పాటు సౌకర్యాలూ లేవని ఆరోపిస్తున్నారు. జిల్లాలో దాదాపు 288 పెట్రోలు బంకులున్నాయి. వీటి ద్వారా రోజుకు దాదాపు 5.83 లక్షల లీటర్ల పెట్రోలు, మరో 6.50 లక్షల లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతోంది. చాలా బంకుల్లో వాహనాల టైర్లకు గాలి పట్టిద్దామంటే యంత్రాలు పనిచేయడం లేదని చెబుతారు. ఇంకొన్నిచోట్ల గాలి పట్టడానికి డబ్బులు అడుగుతున్నారని వాహనదారులు తెలిపారు. తాగునీటి సౌకర్యమూ అంతంత మాత్రంగానే ఉంది. మరుగుదొడ్లు అపారిశుధ్యంగా ఉంటున్నాయని వాపోతున్నారు. వీటన్నింటిపై నిఘా ఉంచాల్సిన అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఇలా జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 11 నెలల వ్యవధిలో 60 బంకుల్లో తనిఖీలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా కొలతల్లో తేడాలుండటం, సౌకర్యాలు కల్పించక పోవడంతో దాదాపు రూ.45,000 వరకు జరిమానా విధించారు.

ఇవి పాటించాలి

ప్రతి పెట్రోలు బంకులో 10,000 లీటర్ల పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే అందులో వచ్చిన ఆదాయంలో మరుగుదొడ్ల నిర్వహణకు రోజుకు రూ.600 నుంచి రూ.700 వెచ్చించాలి. వాహనాల టైర్లకు గాలి పట్టే యంత్రాలు ఉచితంగా అందుబాటులో ఉంచాలి. తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలి. పెట్రోలు నాణ్యత ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టరు పేపర్లు వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి.

ఇలా ఫిర్యాదు చేయొచ్చు

నిబంధనలు పాటించకున్నా, వినియోగదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా వెంటనే జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం 94907 37878 నెంబరు కేటాయించారు.



చాలా బంకులకు నోటీసులిచ్చాం

జిల్లాలోని పెట్రోలు బంకుల్లో తనిఖీలు తరచూ నిర్వహిస్తున్నాం. చాలాచోట్ల పెట్రో కొలతల్లో తేడాలను గుర్తించాం. సౌకర్యాల కల్పనా సరిగా లేదు. ఇటువంటివి గుర్తించి.. నోటీసులు ఇచ్చాం. ఎక్కడైనా లోపాలు గుర్తించి.. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- రఘువీరా, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

తాగునీటి పైపు లైన్లకు మరమ్మతులు



మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నాయుడుపేట, జూలై 2: పట్టణంలోని ఎల్ఏసాగరం కొంతకాలంగా మున్సిపాలిటీ కొళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. 'కలుషిత నీటితో పేటవాసుల అవస్థలు' పేరిట సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాత ట్రెజరీ కార్యాలయం ఎదుట తాగునీటి పైపు లైన్‌కు సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ మేరకు తాగునీటి పైపులకు ఎక్కడ లీక్ ఉన్నా మరమ్మతులు చేయించి సురక్షితమైన తాగునీటిని అందిస్తామని కమిషనర్ చెప్పారు.

తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు



వేములపాళెం సమీపంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు

గూడూరు, జూలై 2: పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కండలేరు జలాశయం నుంచి, వేములపాళెం వాటర్‌వర్క్స్ నుంచి పట్టణానికి తాగునీరు అందించే పైప్ లైన్లు పలు చోట్ల లీకేజీల కారణంగా నీరు వృథాగా పోతుండడంతో పట్టణ ప్రజలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారన్నారు. ఈ క్రమంలో పట్టణ ప్రజలకు తాగునీరు అందించే పైప్‌లైన్లు పలు దగ్గర్ల లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. దీంతో తాగునీరు వృథా కాకుండా సరఫరా సామర్థ్యం కూడా పెరుగుతుందని కిరణ్‌కుమార్ వెల్లడించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు మేధాసింగ్



గూడూరు, జూలై 2: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని మేదాసింగ్‌ను మంగళవారం స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రావణి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జూన్ 24న విజయవాడలో అండర్-13 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన మేధాసింగ్ ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు బహుమతుల పంపిణీ

గూడూరు, జూలై 2: క్రీడలతో మాన సికోల్లాసం పెంపొందుతుందని రోటరీ క్లబ్ సభ్యులు ఎ. గోపాల్ రెడ్డి, డాక్టర్ జనార్ధనరెడ్డి అన్నారు. ఏ.ఏ.రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరు ఆదిశేషారెడ్డి స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు సోమవారం రాత్రి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యా ర్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహించా మన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. మునిగిరీష్, శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటడం సామాజిక బాధ్యత



గూడూరు అర్బన్, జూలై 2: మొక్కలను నాట డం సామాజిక బాధ్యతగా భావించాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం సరస్వతి శిశు మందిరం ఆవరణంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం వలన పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పాశిం గెలవడంతో తిరుమలకు పాదయాత్ర



గూడూరు అర్బన్, జూలై 2: గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పాశిం సునీల్‌కుమార్ గెలవడంతో టీడీపీ నాయకులు తిరుమలకు పాదయాత్రగా బయలు దేరారు. ఈ ఎన్నికల్లో పాశిం గెలుపొందితే తిరుమలకు గూడూరు నుంచి పాదయాత్రగా వెళ్లి వేంకటేశ్వరస్వామి దర్శించుకుంటామని స్థానిక తెలుగుయువత నాయకులు మొక్కుకున్నారు. పాశిం ఎమ్మెల్యేగా గెలవడంతో మంగళవారం స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి పట్టణానికి చెందిన అనీష్ కుమార్, సుధీర్‌కుమార్, క్రాంతి, వెంకటేష్, సాకేత్ కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



బాలాయపల్లి, జూలై 2: మండలంలోని గొట్టికాడులో కొలువై ఉన్న పో లేరమ్మకు మంగళవారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్. మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి,ఎస్.బాస్కర్‌రావు, సీసీ నాయుడు, ఎం.గోపీకృష్ణా రెడ్డి, కె.రామచంద్ర నాయుడు, బి.కల్యాణ్ రెడ్డి, రవిరెడ్డి, మీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

తడ, జూలై 2: రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. కోల్‌కాతా నుంచి చెన్నై వెళ్తున్న సంత్రాగచి ఎక్స్‌ప్రెస్‌లో పశ్చిమబెంగాల్‌కు చెందిన రతన్(27) ప్రయాణిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆ రైలు తడ స్టేషన్‌ను నెమ్మదిగా దాటుతుండగా రతన్ ట్రైన్ నుంచి కిందకు దిగే క్రమంలో అదుపుతప్పి జారి పడి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మెగా డీఎస్సీతో తీరనున్న ఉపాధ్యాయుల కొరత: కురుగొండ్ల

డక్కిలి, జూలై 2: మెగా డీఎస్సీ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం డక్కిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టడంతో ఆ శాఖకు పునర్వైభవం సంతరించుకుంటుదన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నదే తన ఆకాంక్షని చెప్పారు. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు పడిపోయాయన్నారు. అందుకే టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ నిర్వహణపై తొలి సంతకం చేశారన్నారు. ఇకపై పాఠశాల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, వితరగతి గదులు, మైదానాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ. రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, నాయకులు జి.చంద్రశేఖరరెడ్డి, ఆర్.రాజా, ఎన్.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లీలామాధురి, డీఈవో శేఖర్, బాలయోగి బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ చౌడయ్య, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



విద్యా కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

అందాలతీరం... అభివృద్ధి శూన్యం!





తీరంలో ఆకట్టుకుంటున్న జెట్టి - వారాంతంలో పర్యాటకుల సందడి

వాకాడు, జూలై 2: తూపిలిపాళెం సముద్రతీరం ఆహ్లాదకరంగా ఉండటం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. పారిశ్రామికంగానూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరంలో వసతులు కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వైసీపీ పాలకులు, అధికారులు తరచూహామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. సముద్ర నీటిని రొయ్యల హేచరీలకు ఉపయోగించేలా సముద్రంలో ఏర్పాటు చేసిన జెట్టి పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. సముద్రంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అంచనా వేయడానికి 2017లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 150 ఎకరాల్లో ఎన్ఐఓటి (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ) తూపిలిపాళెం వద్ద ఏర్పాటు చేశాయి. సముద్రం ఒడ్డున 1979లో నిర్మించిన గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. వారంతపు సెలవు దినాల్లో 500మంది పర్యాటకులు సాధారణ రోజుల్లో 50మంది పైగా సందర్శకులు వస్తూ ఉంటారు. పర్యాటకులు సొకచెట్ల కింద సేదతీరాల్సిన పరిస్థితి ఉంది. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అయినా తూపిలిపాళెంను పర్యాటకరంగా అభివృద్ధి చేస్తారని పర్యాటకులు ఆశిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

● నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈవో

నాయుడుపేట టౌన్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చెప్పారు. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్ స్థాయిలో ఎంఈవోలు, హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే స్టూడెంట్ కిట్ పంపిణీని పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను సరైన సమయంలో పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నభోజన పథక నిర్వహణలో లోపాలు ఉంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. యూడైస్ ప్లస్, విద్యా పర్వేష్‌లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఇప్పటినుంచే కృషి చేయాలని ఆదేశించారు. గూడూరు డిప్యూటీ డీఈవో శాంతి, అసిస్టెంట్ ఏఎంవో మధు, ఎంఈవోలు మునిశేఖర్, మునిరత్నంతోపాటు డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

వేళ్లు లేని మహిళకు బియ్యం పంపిణీ



కోట, జూలై 2: ప్రమాదవశాత్తు రెండు చేతుల వేళ్లు పోగొట్టుకున్న గిరిజన మహిళ పాపమ్మ నాలుగు నెలలుగా రేషన్ బియ్యం అందకుండా ఇబ్బంది పడుతోంది. ఈ క్రంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎండీయూ ఆపరేటర్లు బియ్యం ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. మండల పరిధిలోని నెల్లూరు పల్లికొత్తపాళెం గిరిజనకాలనీకి చెందిన పాపమ్మకు ఆరు నెలలక్రితం ప్రమాదంలో రెండుచేతుల వేళ్లు కత్తిరించేశారు. ఒంటరి మహిళ అయిన పాపమ్మ అటు కూలీలకు వెళ్లలేక రేషన్ బియ్యంతోనే జీవనం సాగించింది. అయితే ఈపోస్ మెషిన్‌లో ముద్రలుపడని కారణంగా నాలుగు నెలలుగా బియ్యాన్ని నిలిపేశారు. ఎట్టకేలకు తహసీల్దారు డి.నాగరాజరావును ఆశ్రయించగా ఆయన ఎండీయూ ఆపరేటర్లకు ఫోన్ చేసి బియ్యం ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

రేషన్ పంపిణీ తనిఖీ



వాకాడు, జూలై 2 : మండలంలోని వాకాడు గ్రామంలో ఎండీయు వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న ప్రక్రియను మంగళవారం తహసీల్దారు నరసింహరావు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి దగ్గరకే వాహనం వచ్చి రేషన్ ఇస్తున్నారాఅని అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ సారంగపాణి, ఆర్ఐ సెల్వరాజ్, తదితరులు ఉన్నారు.

మంత్రి ఆనంను కలసిన రంగినేని

నాయుడుపేట టౌన్, జూలై 2: దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బీజేపీ సీనియర్ నేత రంగినేని కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు పట్టణంలోని మంత్రి ఆనం స్వగృహంలో మంగళవారం ఉదయం ఆయనకు కృష్ణయ్య పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలసిన వారిలో డాక్టర్ ఆర్.సురేష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

చిల్లకూరు, జూలై 2: వైద్యసిబ్బంది గ్రామాల్లో కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించి కుష్ఠు, క్షయ, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి ఉన్నవారికి శరీరంపై స్పర్శ లేని మచ్చలు, నొప్పిలేని పుండ్లు ఉంటాయన్నారు. కుష్ఠువ్యాధి నిర్ధారణ జరిగితే వారికి ఖరీదైన మందులు, శస్త్రచికిత్సలు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజా, తేజశ్విని, సిబ్బంది మునిలక్ష్మి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు పింఛన్ అందజేత

కోట, జూలై 2: పలు వ్యాధులతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు వయో వృద్ధులకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, మత్స్యశాఖ అసిస్టెంట్ నాగరాజు వెళ్లి అందజేయడంతో వారి ముఖాల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. మండల పరిధిలోని గోవిందపల్లిపాళెంకు చెందిన పి.యానాదయ్య మధుమేహం కారణంగా పాదాన్ని తొలగించారు. దీంతో నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదే విధంగా వెంకన్నపాళెంకు చెందిన కృష్ణయ్య క్యాన్సర్‌తో నెల్లూరులోని క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరికీ వారు చికిత్స పొందుతున్న ఆస్పత్రుకే వెళ్లి పింఛన్ అందజేశారు.

చిట్టమూరు: మండల పరిధిలోని ఈశ్వరవాక గ్రామానికి చెందిన యల్లసిరి హేమలత అనారోగ్యం కారణంగా నెల్లూరు జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండడంతో పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్ భాషా మంగళవారం నెల్లూరుకు వెళ్లి పింఛను అందజేశారు

ప్రజలకు అందుబాటులో సచివాలయ సేవలు

ఓజిలి, జూలై 2: సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని, కారదర్శులను ఎంపీడీవో శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను నిర్వర్తించడంతో పాటు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు.

వసతి గృహ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జూలై 2 : పట్టణంలోని ఓ వసతి గృహ విద్యార్థిని అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఎప్పటిలాగే విద్యార్థిని వసతిగృహం నుంచి కళాశాలకు వెళ్లింది. సాయంత్రం ఆ విద్యార్థిని వసతి గృహానికి తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాలలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం వసతి గృహ అధికారి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పెళ్లకూరు, జూలై 2: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎల్‌పీవో రవీంద్రబాబు తెలిపారు. మండల పరిధిలోని అర్ధమాల, అర్లపాడు, పునబాక, అక్కగారిపేటల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు తాగునీటి వనరులను పరిశీలించారు. అనంతరం అక్కగారిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ దాస్ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దూసుకెళ్లిన ఆటో



కోట, జూలై 2: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తిపై మంగళవారం ఆటో దూసుకెళ్లింది. ఈ సంఘటనలో కృష్ణమూర్తి ఎడమకాలు, ఎడమచేతికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోట ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆటోవాలాలు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

కలికిరి, జూలై 2: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు మంగళవారం కలికిరి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కూడిన కమిటీ అర్హులైన విద్యార్థులను పారదర్శక పద్ధతిలో ఎంపిక చేసింది. గత వారం మిగులు సీట్ల భర్తీ కోసం జిల్లా స్థాయిలో కలికిరి గురుకుల పాఠశాలలో అర్హత పరీక్షలు నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులను 1:2 నిష్పత్తిలో కౌన్సిలింగ్ కోసం ఎంపిక చేశారు. మంగళవారం బాలురకు మాత్రం కౌన్సెలింగ్ ను పరిమితం చేశారు. బుధవారం బాలికల సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సదుం, సత్యవేడు, ఐతేపల్లె, తంబళ్లపల్లె (అంగళ్ళు), కుప్పం పాఠశాలల్లో 6వ తరగతిలో అందుబాటులో ఉన్న 51 సీట్లు, 7వ తరగతిలో 20 సీట్లు, 8వ తరగతిలలో 36 సీట్లు, 9వ తరగతిలో 51 సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. మొదట విద్యార్థులతో పాటు హాజరైన తల్లిదండ్రులకు సీట్ల ఎంపిక విధానాన్ని గురించి కన్వీనరు, కలికిరి పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ అవగాహన కల్పించారు. కౌన్సెలింగ్‌లో సదుం, ఐతేపల్లె, సత్యవేడు, తంబళ్లపల్లె, కుప్పం, కలికిరి పాఠశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు రెడ్డి, దేవి సులోచన, శ్రీనివాసులు, రామాంజనేయ రెడ్డి, సరోజ, సోమశేఖర్ పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్న సోమశేఖర్

కాలినడక భక్తుల భద్రతకు ప్రాధాన్యమివ్వండి

జంతువుల కదలికలు తెలిసేలా చర్యలు తీస్కోండి

అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై2(ఆంధ్రజ్యోతి): అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గంలో వెళ్లే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో ప్రభుత్వ అటవీ, టీటీడీ అటవీ, ఇంజనీరింగ్, భద్రత విభాగాలతో కాలిబాట భక్తుల భద్రత చర్యలపై మంగళవారం ఈవో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాలే కాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకునేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి ఏడవ మైలు వరకు సంచరించే జంతువుల కదలికలు ఎప్పటికప్పుడు కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంతువుల కదలికలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు భద్రతా విభాగానికి తెలియజేయడం ద్వారా భక్తులను హెచ్చరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సంయుక్త కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు చాలా ఖర్చుతో కూడుకున్నవని, తక్కువ ఖర్చుతో అయ్యే నిర్మాణాలను, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని కమిటీకి ఉత్తరం రాయాలని అధికారులను ఆదేశించారు. కాలినడకమార్గంలో ఏయే సమయాల్లో భక్తుల రాకపోకలు అధికంగా, తక్కువగా ఉన్నాయి.. ఏ సమయాల్లో చిరుతలు ఈ ప్రాంతాలలో తిరుగుతున్నాయి.. తదితర సమాచారాన్ని అటవీ అధికారులు పీపీటీ ద్వారా వివరించారు. నిర్దేశించిన సమయాల్లోనే కాలినడక భక్తులు తిరుమలకు చేరుకునేలా ఆయా సమయాల్లో మార్పులు చేయవల్సిందిగా ఈవో దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవాలని జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్‌కు ఈవో సూచించారు. అంతకుముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త కమిటీ ప్రతిపాదనలు, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారిచ్చిన ప్రతిపాదనలను అటవీ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సంబంధిత ప్రతిపాదనలలో ఏ పనులు చేపట్టారు, ఎన్ని పురోగతిలో ఉన్నాయి, ఇంకా ఎన్ని పనులు చేయాలనే అంశాలపై ఈవో సమీక్షించారు. ఎస్వీ జ్యూపార్క్ క్యూరేటర్ సెల్వం, తిరుపతి డీఎఫ్‌వో సతీష్, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాస్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో కార్చిచ్చు



చెట్ల కొమ్మలతో మంటలార్పుతున్న సిబ్బంది

తిరుమల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటిఘాట్‌రోడ్డులోని అడవిలో మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమైన భక్తుల్లో కొంతమంది 31వ మలుపు వద్ద పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా కర్పూరం వెలిగించి వెళ్లిపోవడంతో గాలికి మంటలు చెలరేగాయి.గుర్తించిన వాహనదారులు ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు ఘటనా ప్రాంతానికి చేరుకుని పచ్చిచెట్ల కొమ్మలు, బాటిళ్ల ద్వారా నీళ్లు చల్లి మంటలను అదుపుచేశారు.

పాపవినాశనంలో దుకాణదారుల మధ్య వాగ్వాదం

తిరుమల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలోని పాపవినాశంలో మంగళవారం దుకాణదారులమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి అనుమతులు లేకపోయినప్పటికీ కొంతమంది వ్యక్తులు తీర్థానికి సమీపంలో దుకాణాలు పెట్టే ప్రయత్నం చేయగా, అక్కడ అధికారికంగా ఉన్న దుకాణదారులు ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తమ దుకాణాల ముందు ఎలా పెడతారంటూ ఆగ్రహించారు. దీంతో ఇరువర్గాలమధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. ఒకరిపై ఒకరు కాలుదువ్వుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడే ఉన్న కొందరు వ్యాపారులు డయల్ 100కు సమాచారమిచ్చారు. దీంతో తిరుమల టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి చక్కబడింది. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. వాగ్వాదానికి దిగిన వర్గాల్లో ఒక వర్గం ట్రైబల్స్ కావడంతో పోలీసులు సమస్యను పరిష్కరించే దిశగా కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

99.6 శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 2: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు రెండో రోజైన మంగళవారం సచివాలయ సిబ్బందితో 99.6శాతం పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్డీఏ పీడీ ప్రభావతి తెలిపారు. తొలి రోజున దాదాపు 95శాతంపైగా వృద్ధాప్య, మిగతా పింఛన్ల పంపిణీ జరిగింది. 2,69,162కుగాను 2,66,636 పింఛన్ల పంపిణీ పూర్తయింది. దాదాపు రూ.180.63కోట్ల పింఛను నగదు అందజేశారు. మిగిలిన 0.4 శాతంలో మృతి చెందినవారు, ఊర్లో లేనివారు మాత్రమే ఉన్నారని గుర్తించారు.

పలమనేరులో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.62.8 కోట్ల పనులు మళ్లీ మంజూరు

పలమనేరు, జూలై 2: పలమనేరు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.62.80 కోట్లకు పైగా విలువ చేసే అభివృద్ధి పనులను తిరిగి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో మంత్రిగా ఉన్న అమరనాథరెడ్డి నియోజకవర్గానికి రూ. 60 కోట్ల విలువ చేసే పనులను మంజూరు చేయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పలమనేరు ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ గెలుపొందారు. దీంతో అమరనాథరెడ్డి మంజూరు చేసిన పనులన్నింటిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పాటు పలమనేరు ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి గెలిచారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి గత నెల చివర్లో కుప్పానికి వచ్చిన చంద్రబాబునాయుడిని అమర్‌ను కలిశారు. పలమనేరు నియోజకవర్గానికి మంజూరై.. వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన పనులను తిరిగి మంజూరుచేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం... ఆ పనులన్నింటిని మళ్లీ మంజూరు చేశారు. దీంతో పలమనేరు నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీనాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ మంజూరు చేసిన పనుల్లో.. వి.కోటలో బాలికల రెసిడెన్షియల్ ఉర్దూ కళాశాల, కమ్యూనిటీ హాలు, పలమనేరులో కమ్యూనిటీ హాలు, షాదీ మహళ్ల మరమ్మతులు, వి.కోటలో అంబేడ్కర్ భవన్ నిర్మాణం, పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లెలో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, వి.కోటలో ప్రభుత్వ డిగ్రీకళాశాల, శీతల గిడ్డంగి, గోడౌన్ల నిర్మాణం, బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్‌జలపాతం వద్ద రిజర్వాయర్ నిర్మాణం, కౌండిన్య నదిపై 16 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, రాయలపేట నుంచి మాధవరం వరకు అర్ధంతరంగా ఆగిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తిచేసేందుకు నిధులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 14 బీసీ కమ్యూనిటీ భవనాలు నిర్మాణం, పలమనేరులో కాపు భవనం నిర్మాణ పనులున్నాయి.

పల్లికొండేశ్వరాలయంలో వైసీపీ నేత హవా

ప్రభుత్వం మారినా రాజీనామా చేయని వైనం



రాధాకృష్ణారెడ్డి

నాగలాపురం, జూలై 2: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వైసీపీ నేత హవా కొనసాగుతోంది. కేవీబీపురం మండలానికి చెందిన వైసీపీ నాయకుడు బాలిరెడ్డి రాధాకృష్ణారెడ్డి గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రెండు పర్యాయాలు పల్లికొండేశ్వర ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమితులయ్యారు. ఈ ఆలయం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో ఆ రాష్ట్రం నుంచి సినీ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు దైవ దర్శనం నిమిత్తం వస్తుంటారు. వీరితో బాలిరెడ్డి పరిచయాలు ఏర్పరుచుకుని విశేష పర్వదినాల్లో ఓ అర్చకుని వెంట పెట్టుకుని తమిళనాడులోని వీఐపీల ఇళ్లకు వెళ్లి ఆశీర్వచనాలు అందించి ఆలయ ప్రసాదాలను అందజేసి వేలాది రూపాయలు దండుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. అంతేగాక తమిళనాడు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని వాటి ద్వారా ఆంధ్రాలోని వీఐపీలకు తమిళనాడులోని ప్రముఖ ఆలయాల్లో బ్రేక్ దర్శనాలు చేయించడం ఆయన వ్యాపారంగా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ప్రభుత్వం ఆదేశించినా బాలిరెడ్డి ఇంకా కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్



తూకివాకం వద్ద చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రేణిగుంట, జూలై 2: రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలో తిరుపతి నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన చెత్త నిర్వహణ కేంద్రాన్ని కమిషనర్ అదితి సింగ్ మంగళవారం పరిశీలించారు. తిరుపతి నగరంలో సేకరించిన చెత్తను తూకివాకం వద్ద గల చెత్త నిర్వహణ కేంద్రానికి తరలిస్తారు. తడి చెత్త(ప్లాస్టిక్) ద్వారా ఎరువు, పొడి చెత్త ద్వారా వచ్చిన వ్యర్థాలను సిమెంటు ఫ్యాక్టరీలకు తరలిస్తారని, మార్కెట్, కూరగాయల వ్యర్థాల నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసే విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. అలాగే మురుగునీటి నిర్వహణ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని ప్లాంట్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంట్‌ను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు సుమతి, చెంయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థులకు రాజ్యపురస్కార్ అవార్డులు

శ్రీకాళహస్తి, జూలై 2: గుంటూరులోని తాడికొండలో ఉన్న రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొన్న శ్రీకాళహస్తి బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పి.వినోద్, పి.మురళీకృష్ణ, ఎస్.శ్రీనివాసులు, ఎ.యశ్వంత్, జె.లోకేష్ అవార్డులకు అర్హత సాధించారు. వీరికి గవర్నర్, రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడు అబ్దుల్ నజీర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్స్ అందజేస్తారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రేణిగుంట, జూలై 2: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని డీఈవో డాక్టర్ శేఖర్ అన్నారు. మంగళవారం రేణిగుంట మండలం కరకం బాడిలో నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటుకలు, బడి మానేసి సిమెంటు, కోళ్ల ఫారాల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈనెల 12 లోపు బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఇంద్రాదేవి, రంగనాథం, ప్రధానోపాధ్యాయులు పుష్పలత, సమగ్రశిక్ష అధికారులు మధు, రుక్మాంగద, సారథి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేవిధంగా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఎంఈవో లక్ష్మీపతి అన్నారు. మంగళవారం కేవీబీపురం మండలంలోని ఓళ్లూరు గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, ప్రగతి సంస్థ సభ్యుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై ఆస్పత్రిలో రోగికి పింఛను అందజేత



ఆస్పత్రిలో ఉన్న గజలక్ష్మికి పింఛను అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

వరదయ్యపాళెం, జూలై 2: అనారోగ్యంతో చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు సచివాలయ ఉద్యోగి యామిని పింఛను అందించారు. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన గజలక్ష్మి గత కొన్ని రోజులుగా వెన్నుముక నొప్పితో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వితంతు పింఛను పొందుతున్న ఆమె స్వగ్రామానికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో సచివాలయ ఉద్యోగి యామిని ఆస్పత్రికి వెళ్లి రూ.7వేలు పింఛను నగదు అందించారు. గజలక్ష్మి కుటుంబసభ్యులు యామినికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

మహిళ మెడలో తాళిబొట్టు అపహరణ

శ్రీకాళహస్తి, జూలై 2: శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు మార్గం అమ్మపాళెం సమీపంలో ఇద్దరు దుండగులు సినిమా ఫక్కీలో మహిళ మెడలోని తాళిబొట్టు లాక్కుని పరారైన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... అమ్మపాళెం గ్రామానికి చెందిన ఓ మహిళ వాకింగ్ చేస్తూ వెళుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రోడ్డు పక్కన నిలుచుకున్నారు. మహిళ అటువైపు వెళ్లగానే మెడలోని తాళిబొట్టు లాక్కుని ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి మిట్టకండ్రిగ వైపు పరారైనట్లు సమాచారం.

స్టార్టర్ల చోరీ

కేవీబీపురం, జూలై 2: మండలంలోని కోవనూరులో సోమవారం రాత్రి సుమారు 30 స్టార్టర్లను దొంగలు అపహరించుకుని పోయారని రైతులు పెంచులయ్య, గిడ్డయ్య, మాయాబజారు, దిన్నయ్య, మల్లెయ్య తెలిపారు. గత నెల రోజులుగా కోవనూరు పరిసర ప్రాంతాల్లోని సుమారు 50 స్టార్టర్ల వరకు చోరీకి గురయ్యాయని సర్పంచు పెంచలయ్య చెప్పారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన ఆటో

తప్పిన ప్రమాదం

కేవీబీపురం, జూలై 2: మండలంలోని రాజులకండ్రిగ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఆటో అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అతి వేగంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఆటో అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెప్పారు. రోడ్లపై స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు పెరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

పాతపాళెంలో పట్టపగలే చోరీ

ఆరు సవర్ల బంగారు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

కేవీబీపురం, జూలై 2: మండలంలోని పాతపాళెం గ్రామానికి చెందిన ప్రసాద్ వర్మ ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఏఎస్‌ఐ లోకనాథం కథనం మేరకు... పాతపాళెం గ్రామానికి చెందిన ప్రసాద్ వర్మ కేవీబీపురం మండల కేంద్రంలో హోటల్ నడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని ఆరు సవర్ల బంగారు, 750 గ్రాముల వెండి సామాన్లు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వెళ్లిన ప్రసాద్ వర్మ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోండి

శ్రీకాళహస్తి, జూలై 2: పట్టణంలోని స్వామి విద్యాప్రకాశ నంద పురుషుల డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈనెల 10వ తేదీలోగా ఓఏఎండీసీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు 11నుంచి 15వ తేదీ వరకు కోర్సుల ఎంపిక చేసుకోవాలన్నారు. 19న సీట్ల కేటాయింపు జరుగుతుందని... అర్హత పొందిన విద్యార్థులు 20వ తేదీ నుంచి కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు 9440167239, 7780390914 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ సర్వీసుల ఏర్పాటు

పిచ్చాటూరు, జూలై 2: పుత్తూరు - నాగలాపురం, పుత్తూరు - కేవీబీ పురం మండలంలోని దిగువతూరు వరకు రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ రెండు మార్గాల్లో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగస్తుల నుంచి వచ్చిన వినతుల మేరకు పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి ఉదయం, సాయంత్రం పూట బస్సు సర్వీసులను నడపాలని కోరినట్లు చెప్పారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పుత్తూరు డిపో మేనేజర్ దిగువ పుత్తూరు, నాగలాపురం వరకు రెండు బస్సులను నడుపుతామని హామీ ఇచ్చారని తెలిపారు.

సూళ్లూరుపేట రోడ్డుకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 2: బుచ్చినాయుడుకండ్రిగ - సూళ్లూరుపేట రోడ్డుకు మరమ్మతులు మంగళవారం చేపట్టారు. గత మూడు సంవత్సరాల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేసి పనులు చేయకుండా వదిలేశారు. దీంతో దారి మొత్తం గుంతలమయమై ప్రయాణం దుర్భరంగా మారింది. టీడీపీ అధికారంలోకి రాగానే సూళ్లూరుపేట రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం చొరవ తీసుకుని డబుల్ రోడ్డు పనులు కూడా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

పాఠశాలల విలీనాన్ని రద్దు చేయండి

నారాయణవనం, జూలై 2: పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఎమ్మెల్యే ఆదిమూలానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

దొంగల ముఠా అరెస్టు



దొంగల ముఠాను అరెస్టు చూపుతున్న సీఐ మల్లికార్జున్

రేణిగుంట, జూలై 2: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక బంగారు చైను స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట సీఐ మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామా నగర్‌లో పోలీసులు గాలింపు చేపట్టారు. పోలీసులను గమనించిన కొంతమంది పారిపోయేందుకు యత్నించగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తిరుపతి మారుతీ నగర్‌కు చెందిన జశ్వంత్, సంజీవనగర్‌కు చెందిన సతీష్, కోలా వీధికి చెందిన జశ్వంత్, ప్రసన్నకుమార్, భవానీనగర్‌కు చెందిన వేముల చరణ్, రఘునాథ్‌రెడ్డి కాలనీకి చెందిన రియాజ్, పాకాలకు చెందిన దిలీప్‌గా తెలిసింది. ఇది వరకే వీరిపై తమిళనాడు తిరువళ్లూరు, తిరుచానూరు, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి దోపిడీ, చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ల చోరీ కేసులు కేసు నమోదైనట్లు తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, రైటర్ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తీరుపై బృందమ్మ ఆవేదన



కుర్చీలు లేక నేలపై బైఠాయించిన రోగులతో మాట్లాడుతున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 2: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ మంగళవారం సందర్శించారు. కాన్పుల వార్డులో పరిస్థితులను పరిశీలించారు. కాన్పులు చేసే బెడ్లు తప్పు పట్టి తీవ్ర అధ్వాన స్థితిలో దర్శనమిచ్చాయి. నాలుగు నెలల కొత్తగా నిర్మించిన గోడల నుంచి టైల్స్ చాలా చోట్ల ఊడిపడిపోవడం గుర్తించి ఫొటోలు తీసుకున్నారు. చేతులు శుభ్రం చేసుకునే బేసన్లు నాలుగు నెలలకే విరిగి పడిపోయిన దృశ్యాలను గమనించారు. ఈ పరిస్థితులపై అధికారులను నిలదీశారు. ఇక కుర్చీలు లేక పలువురు రోగులు, వారి సహాయకులు ఆస్పత్రిలో నేలపైనే బైఠాయించిన పరిస్థితులను చూసి ఆరాతీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పేదల పాలిట ఆరోగ్య ప్రదాయనిగా విశేష ప్రశంసలు అందుకున్న ఆస్పత్రి వైసీపీ పాలనతో వినాశనం పాలై కొన ఊపిరితో కొట్టుమిట్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రెండు నెలల్లో పూర్వవైభవం తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజ నాయుడు, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్‌నర్సు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, జూలై 2: దేశవ్యాప్తంగా ఈనెల 4వ తేదీ గురువారం విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జాకీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీకేజీ వెనుక కుంభకోణం, పరీక్షల రద్దు విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని తెలిపారు. నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గించేశారని తెలిపారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా జూలై 4న దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాబంద్‌కు ఐక్యవిద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిందని చెప్పారు. ఈ బంద్‌లో అన్ని విద్యాసంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిచందు, జయప్రకాష్, శివ, షహిద్, ఆసిఫ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పనిముట్ల అందజేత

నారాయణవనం, జూలై 2: మండలంలోని షెడ్యూలు కులాల రైతులకు పీఎంఏజేఏవై పథకం కింద ప్రకృతి వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాల రహిత ప్రకృతి సేద్యం మానవాళికి, భూమికి ఎంతో శ్రేయస్కరమని చెప్పారు. ప్రకృతి వ్యవసా యాన్ని ప్రోత్సహించేందుకు షెడ్యూల్ కులాల రైతులకు డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

బెడ్‌షీట్ల పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 2: శ్రీకాళహస్తి బాలికల వసతిగృహాల్లో విద్యార్థినుల శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల బృందమ్మ మంగళవారం బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి ఫోర్స్ బస్సులు



తేజోమూర్తికి బస్సు తాళాలు అందజేస్తున్న శివప్రసాద్

రేణిగుంట, జూలై 2: తిరుపతి - రేణిగుంట రోడ్డులోని శ్రీదుర్గా ఫోర్స్ షోరూమ్‌లో మంగళవారం ఫోర్స్ స్కూల్ బస్సులను మార్కెట్లోకి విడుదల చేశారు. వీటిని చిత్తూరుకు చెందిన విజయం గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత తేజోమూర్తి మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీదుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్, ఫోర్స్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ నుంచి 55 సీట్ల కెపాసిటీతో స్కూల్ బస్సులను విడుదల చేశామన్నారు. మోనోకోక్ బాడీతో ఉన్నతమైన పారాబోలిక్ సస్పెన్షన్‌తో ప్యాసింజర్లకు కారులో తిరిగే అనుభూతితో మంచి మైలేజీ కలిగి ఉండటం ఈ బస్సుల ప్రత్యేకత అని చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

సత్యవేడు, జూలై 2: గంజాయి కేసులో సత్యవేడు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కిలో గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శ్రీకాళహస్తి మార్గంలో కాళమనాయుడుపేట వద్ద మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులను పోలీసు సిబ్బంది ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా బైక్‌ట్యాంక్ కవరులో గంజాయి బయటపడింది. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు యువకులను అదుపులో తీసుకుని విచారించగా సత్యవేడు గంగమిట్ట వీధికి చెందిన కుమార్(25), దళితవాడకు చెందిన కాశీయప్ప(22)గా తెలిసింది. వారు వారు గంజాయి అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.ఐదువేలు, ద్విచక్ర వాహనం విలువ రూ. 50 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితులు సూళ్లూరుపేటలో గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులు ఉదయమే పట్టుబడ్డా పొద్దుపోయే వరకు సంబంధిత వివరాలను మీడియాకు వెల్లడించకుండా పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు దారితీసింది. ఈ విషయమై సీఐ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా నిందితుల విచారణ, కేసు నమోదు తదితర ప్రొసీజర్ ఆలస్యం కావడంతో ప్రెస్‌మీట్ పెట్టలేకపోయామని ఆయన చెప్పడం కొసమెరుపు.

సేంద్రియ పంట ఉత్పత్తులతో ఆరోగ్యం

నారాయణవనం, జూలై 2: సేంద్రియ పద్ధతులలో సాగు చేసిన పంట ఉత్పత్తులతో ఆరోగ్యం చేకూరుతుందని పాలమంగళం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహరి చెప్పారు. పుత్తూరులోని వెంకట పెరుమాల్ ఇంజనీరింగ్ కళాశాల తృతీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు కమ్యూనిటి సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం సేంద్రియ సాగుపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులతో భూక్షారంతో పాటు నాణ్యత, పోషకాలు లేని ఆహార ఉత్పత్తులు అందుతాయన్నారు. దీనివల్ల పర్యావరణ కాలుష్యం, జీవ పరిణామంపై ప్రభావం తదితర అంశాలను వీడియో రూపంలో చూపించి అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పుత్తూరు వార్తలు

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు టౌన్, జూలై 2: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని ఎంఈవోలు తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం అన్నారు. మండల పరిధిలోని నేషనూరు పంచాయతీ, మొగిలి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి మానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణాపురం, పిళ్లారిపట్టు, నేషనూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న ద్రౌపదీదేవి తిరునాళ్ల గ్రామసభ

పుత్తూరు టౌన్, జూలై 2: పుత్తూరులోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై చర్చించేందుకు ఈనెల 5న శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 9 నుంచి ఆగస్టు 19 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు పుత్తూరు మండల మీట్

పుత్తూరు టౌన్, జూలై 2: పుత్తూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 4వ తేదీ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

వాగ్దానాన్ని నెరవేర్చిన చంద్రబాబు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పుత్తూరు అర్బన్, జూన్ 2: ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లను రూ.4 వేలకు పెంచి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు వాగ్దానాన్ని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడమే కాకుండా ఏప్రిల్ నుంచి అమలు చేస్తానన్న హామీని నిలబెట్టుకుంటూ రూ.3వేలు అదనంగా అందించి సీఎం చంద్రబాబు పేదల పక్షపాతిగా మరోసారి నిరూపిం చుకున్నారని కొనియాడారు. ఒక్క పుత్తూరు మున్సిపాలిటీలోనే రూ.4.30 కోట్లు పింఛన్లు అందించారని చెప్పారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



పుత్తూరు టౌన్, జూలై 2: పుత్తూరు పట్టణంలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. ఎల్ఐసీ యూనియన్ కార్యదర్శి లక్ష్మణకుమార్ మాట్లాడుతూ యూనియన్ సమాజిక సేవ కార్యక్రమంలో ఎల్లవేళాలా ముందుంటామని చెప్పారు. ఈనెల 5 తేదీన తమ కార్యాలయ ఆవరణలో నిర్వహించే రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. రక్తదాతలు 9949051900, 9440844925 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆంజనేయులు, గణేష్, బాబు, రాజేష్, ప్రవీణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, జూలై 2: ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 4 న జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు మహేష్, పట్టణ అధ్యక్షుడు దిలీప్ పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాల ఫీజుల దోపిడిని అరికట్టాల కోరుతూ చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.